వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
శనివారం, ఆగస్టు 01, 2026

# ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు కచ్చితంగా పాటించాలి

- హైదరాబాద్ డిఎంహెచ్ఓ డా.పుట్ల శ్రీనివాస్
- సికింద్రాబాద్ కిమ్స్ ఆడిటోరియంలో ఘనంగా వైద్య సిబ్బంది ఓరియంటేషన్ శిక్షణ
- తెలంగాణ క్యాన్సర్ పోర్టల్ నమోదు తప్పనిసరి
- హాజరైన 326 మంది ప్రైవేట్ వైద్య సంస్థల ప్రతినిధులు






**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నగరంలోని ప్రైవేట్ హెల్త్ ఫెసిలిటీస్ అన్నీ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, పిఎన్‌డిటి యాక్ట్‌తోపాటు అన్ని చట్టబద్ధమైన నియమ నిబంధనలను విధిగా పాటించాలని హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు. శనివారం సికింద్రాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్స్ ఆడిటోరియంలో ప్రైవేట్ ఆస్పత్రుల మెడికల్, మేనేజింగ్ డైరెక్టర్ల కోసం ప్రత్యేక ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం, పిఎన్‌డిటి చట్టం, సరోగసి చట్టం, ఫైర్ సేఫ్టీ, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ మరియు తెలంగాణ క్యాన్సర్ పోర్టల్ విధివిధానాలపై విస్తృతంగా శిక్షణ ఇచ్చారు. రాష్ట్రంలో క్యాన్సర్ నియంత్రణ, ప్రణాళికలు మరియు సమగ్ర డేటాబేస్ రూపకల్పన కోసం నిర్ధారణ అయిన ప్రతి రోగిని 'తెలంగాణ క్యాన్సర్ పోర్టల్'లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ఈ పోర్టల్ నమోదు ప్రక్రియపై ప్రత్యక్ష ప్రదర్శన ఇచ్చి ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, డయాగ్నొస్టిక్ సెంటర్లు తమ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రతినెల నోటిఫై చేయవలసిన వ్యాధుల నివేదికలను సమర్పించాలి. వ్యాధుల వ్యాప్తి అనుమానం వస్తే నెలవారీ నివేదికల కోసం వేచి చూడకుండా వెంటనే ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం అందించాలని, అలాగే సమన్వయం కోసం ప్రతి హెల్త్ ఫెసిలిటీ ఒక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టాన్ని, పిసి & పిఎన్‌డిటి చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అల్ట్రాసౌండ్, డయాగ్నొస్టిక్ కేంద్రాలు ఫామ్–ఎఫ్ నిర్వహణ మరియు ఆన్‌లైన్ డేటాను వంద శాతం ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. సీఈఏ నిబంధనల ప్రకారం రికార్డులు, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలి. ఆస్పత్రులలో అగ్నిమాపక భద్రత, రోగుల రక్షణ ప్రమాణాలను విధిగా పాటించాలని డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ శ్రీ దాస్ వివరించగా, బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణపై అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ సైంటిస్ట్ డా. మహేష్ రాసాల సమగ్రంగా అవగాహన కల్పించారు. ప్రజారోగ్య సేవలను మరింత బలోపేతం చేయడంలో ప్రైవేట్ వైద్య సంస్థల సహకారం ఎంతో అవసరమని, ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు పూర్తి మద్దతు అందించాలని డిఎంహెచ్ఓ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా.శ్రీధర్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా.సాయిబాబా, డా.సరస్వతి, డా.చల్లా దేవి, డా.ఆశ్రిత రెడ్డి, డా.కల్పనా తోరను, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు, జిల్లా మాస్ మీడియా అధికారి జక్కుల రాములుతోపాటు వివిధ హెల్త్ ఫెసిలిటీలకు చెందిన 326 మంది ప్రతినిధులు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్లు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు ఎంపికైన చేనేత కళాకారులు

## అభినందించిన చిప్ప వెంకటేశ్వర్లు



**వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రతి ఏటా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్ట్ 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా అందించే ప్రతిష్టాత్మక 'కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత అవార్డుల'కు వరంగల్ నగరానికి చెందిన ఇద్దరు నిపుణులైన చేనేత కళాకారులు ఎంపికయ్యారు. ఈ పురస్కారం కింద జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో పాటు రూ.25,000 నగదు బహుమతిని అందజేస్తారు. ఈ ఏడాది వరంగల్ జిల్లా నుంచి మొత్తం 4 దరఖాస్తులు రాగా, రాష్ట్ర ప్రభుత్వ సెలక్షన్ కమిటీ పరిశీలనలో క్రింది ఇద్దరు కళాకారులు అవార్డుకు ఎంపికైనట్లు టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు తెలిపారు. గోరంటల (పిట్ట) రాజు, కంచె సమత ఈ ఇద్దరు కళాకారులు తమ కులవృత్తిని తమ తండ్రుల ద్వారా అభ్యసించి, చేనేత రంగంలో నూతన డిజైన్లను రూపొందించడంలో విశేష అనుభవం సంపాదించారు. కస్టమర్ల అభిరుచులకు తగినట్లుగా ఆకర్షణీయమైన కలర్ కాంబినేషన్లతో నూతన డిజైన్లను తయారు చేసి సెలక్షన్ కమిటీకి పంపగా, వారి ప్రతిభను గుర్తించి ఈ అవార్డులకు ఎంపిక చేశారు. ఆగస్ట్ 7న హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజా వద్ద నిర్వహించే అధికారిక జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగా వీరు ఈ పురస్కారాలను అందుకోనున్నారు. ఈ సందర్భంగా అవార్డులకు ఎంపికైన గోరంటల రాజు, కంచె సమతలకు చిప్ప వెంకటేశ్వర్లు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే, వరంగల్ జిల్లా నుంచి ఈ అవార్డుల ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించిన చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు శ్రీకాంత్ రెడ్డికి, ఉప సహాయ సంచాలకులు సుధీర్‌కు ఆయన తన కృతజ్ఞతలు తెలియజేశారు.



# ఘనంగా గోరింటాకు వేడుకలు



**శాయంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మండలంలోని పెద్దకొడపాక గ్రామంలోని శ్రీ వేద పాఠశాలలో శనివారం గోరింటాకు ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థినులకు చేతులకు గోరింటాకు అలంకరించి మన సంప్రదాయాల విశిష్టతను వివరించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు అత్యంత ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ మాట్లాడుతూ.. మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లోని ప్రతి ఆచార వెనుకా ఒక శాస్త్రీయ కారణం దాగి ఉంటుందని తెలిపారు. గోరింటాకు పెట్టుకోవడం వల్ల శరీరంలో రక్తప్రసరణ మెరుగుపడటంతో పాటు చర్మ ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. చిన్నారులకు చిన్ననాటి నుంచే మన తెలుగు సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడం ద్వారా మన పూర్వీకుల వారసత్వాన్ని భావితరాలకు సక్రమంగా అందించవచ్చని ఆయన పేర్కొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు ప్రియాంక, కీర్తి రెడ్డి, సౌందర్య, వేద తదితరులతో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు.

# భవిష్యత్ నాయకత్వానికి పునాది ఇన్వెస్టిచర్ వేడుక

- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్
- యూసుఫ్‌గూడ శ్రీ చైతన్య హైస్కూల్‌లో ఘనంగా విద్యార్థి క్యాబినెట్ పదవీ స్వీకార వేడుక
- నూతనంగా ఎన్నికైన హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌కు బ్యాడ్జీలు ప్రదానం చేసిన ముఖ్య అతిథి




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన ఆలోచనలను పెంపొందించేందుకు ఇన్వెస్టిచర్ వేడుకలు అద్భుతమైన వేదికగా నిలుస్తాయని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని యూసుఫ్‌గూడ శ్రీ చైతన్య హై స్కూల్‌లో నిర్వహించిన ఇన్వెస్టిచర్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నూతనంగా ఎంపికైన హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌తో పాటు వివిధ విద్యార్థి క్యాబినెట్ సభ్యులకు ఎమ్మెల్యే ఘనంగా బ్యాడ్జీలు, హోదాలను ప్రదానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. విద్యతో పాటు నాయకత్వ గుణాలు ప్రతి విద్యార్థిలో ఉండాలని సూచించారు. విద్యార్థి దశలో అలవర్చుకునే క్రమశిక్షణ, బాధ్యతలు భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా, ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. విద్యార్థుల్లో సేవాభావం, నైతిక విలువలను పెంపొందించేలా ఇలాంటి కార్యక్రమాలను నిత్యం నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నీలావతి, ఆర్.ఐ హరికృష్ణ, రమేష్ తదితరులు ఎమ్మెల్యేను ఘనంగా స్వాగతించి శాలువాతో సత్కరించారు. ఈ వేడుకల్లో పాఠశాల యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

